# స్థానబలం

మినీకథ

ఎన్.సి. చక్రవర్తుల



"అమ్మగారు రిక్షా అండీ"-అడిగాడు కోటిగాడు అప్పుడే స్టేషన్ నుంచి బయటకు వస్తున్న సుబ్బాయమ్మగార్ని చూసి. "రామచంద్రరావు పేట కనక దుర్గ గుడి దగ్గరకు ఎంతరా అబ్బీ"-"నాలుగు రూపాయలిప్పించడమ్మా".

"ఏంట్రోయ్ ఈ ఊరు నాకేమైనా కొత్త అనుకుంటున్నావా? రూపాయిన్నరిస్తాను" "బోణీ బేరమండి. రానని సెప్పనుగాని మూడు రూపాయలిప్పించండమ్మా" అన్నాడు ప్రొద్దుట్నుండీ బేరం లేని సంగతి గుర్తు తెచ్చుకుంటూ. "అదేంలేదుగాని రెండున్నరిస్తా వస్తేరా" అంది తనిప్పటివరకు నాల్గు రిక్షాలు బేరం ఆడి కుదరని సంగతి గుర్తు తెచ్చుకుంటూ.

"సరే ఎక్కండి" అనంగానే తన భారీ శరిరాన్ని దాంట్లో కూలేసింది సుబ్బాయమ్మ.

*  *  *

"ఇంకెక్కడికెల్లాలమ్మా గుడి దాటి సానా దూరం వచ్చేసాం" విసుక్కుంటూ అడిగాడు కోటిగాడు.

"ఆపైసందులోకేరా" అంటూ, ఇంకో అరమైలు పోయాక. "ఇక్కడే ఆవు. నీదగ్గర ఐదు రూపాయల చిల్లర వుందా" అని అడిగింది.

"లేదమ్మగారు మీకాడుంటే సూడండి" అనగానే అవిడ ఇంట్లోకెళ్ళి ఓ పావుగంటయ్యాక "ఇదిగోరా అబ్బీ" అంటూ డబ్బులు తెచ్చి ఇచ్చింది.

అది లెక్కపెట్టుకున్న కోటిగాడు "ఇదేంటమ్మా రెండున్నర సెప్పి రూపాయిన్నరిస్తున్నారు" అనడిగాడు.

"అయ్యో అయ్యో చూశావా తమ్ముడూ! రూపాయిన్నరకి ఒప్పుకొని ఇప్పుడు రెండున్నరిమ్మంటున్నాడు.". అంటూ వాపోయింది సుబ్బాయమ్మ.

వెంటనే సుబ్బాయమ్మకు వరసకు తమ్ముడైన సుబ్బారావు "ఏంట్రా వేషాలేస్తున్నావా. అయినా ఈమధ్య రిక్షా వాళ్ళకి ఇదొక ఆటయి పోయింది." అంటూ అరిచేసరికి అక్కడ చేరిన నల్గురూ కోటిగాడ్ని తలో సూటి పోటి మాటలతో బాధించారు.

ఏకాకి అయిన కోటిగాడు తనకు జరిగిన అవమానానికి మనసులోనే బాధపడుతూ అక్కడ్నుండి రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

***  ***  ***

"ఏయ్ రిక్షా అబ్బీ వస్తావా" అని అడిగింది అప్పుడే సామాన్లతో సహా బయటకి వచ్చిన సుబ్బాయమ్మ.

"అలాగేనండి ఎక్కండి" అన్నాడు సూరిగాడు.

"పెద్ద స్టేషనుకి ఎంతేమిటి" అనడిగింది సుబ్బాయమ్మ.

"తమకు తెలీన్డి ఏముందండి! ఎంతో కొంత ఇప్పించండి" అన్నాడు సూరిగాడు.

"అదేం కుదరదుగానీ ఎంతో చెప్పు. తీరా అక్కడికి వెళ్ళాక గొడవ చేస్తే కాదు. మొన్నక వెధవ ఇలాగే గొడవ పెట్టాడు".

వెంటనే సూరిగాడు "నేనసుమంటోడ్ని కాదమ్మగారు, ఇరవై ఏళ్ళ నుండి ఈ సెంటర్లో రిక్షా తిప్పుతున్నోడ్ని. తమరెక్కండమ్మా" అన్నాడు.

***  ***  ***

"అదేంటమ్మా ఐదు రూపాయలు బేరం ఆడి రూపాయిన్నరిస్తున్నారు" అని సూరిగాడు అనేసరికి సుబ్బాయమ్మ గారి గుండెల్లో పిడుగు పడ్డట్లయింది.

చుట్టూ జనం ఎదురు లేక పోవటాన్ని, నిన్న తనను తీసుకు వచ్చిన కోటిగాడు, ఇంకా కొందరు రిక్షా వాళ్ళు అందరూ తన రిక్షా చుట్టుముట్టడంతో మరేంమాట్లాడక ఐదు రుపాయలు తీసి సూరిగాడి చేతిలో పెట్టింది సుబ్బాయమ్మ.